క్లుప్తంగా

కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని వాసవీ క్లబ్ నవ నిర్మాణ కపుల్స్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. ఇంటర్నేషనల్ మల్టిపుల్ డైరెక్టర్ మాజేటి రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్త గణేష్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవీ క్లబ్ నవ నిర్మాణ కపుల్స్ అధ్యక్షురాలిగా రాచమడుగు లక్ష్మీమానస చైతన్య, సెక్రటరీగా పెనుగొండ హారిక, ట్రెజరర్‌గా శైలజ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి



పెనమలూరు: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని క్రమశిక్షణతో మెలగాలని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయన్నారు. రౌడీషీటర్లు ఎన్నికల ప్రచారంలో, ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనరాదన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు శాంతిభద్రలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధి అవకాశాలు చూసుకొని క్రమశిక్షణతో జీవించాలని సూచించారు.

కొనసాగుతున్న మండల దీక్ష పారాయణం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న మండల దీక్ష పారాయణం ఆదివారం 16వ రోజుకు చేరుకుంది. ఫిబ్రవరి 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతమ్మ మాతృ మండలి నేతృత్వంలో శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు పుర ప్రముఖులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి అన్న సమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా భక్తులు, గ్రామస్తులు, దాతల సహకారంతో అయ్యప్పస్వామి అన్న సమారాధన చేస్తున్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అయ్యప్పస్వామి అన్నసమారాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మంత్రితో పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నమారాధన కార్యక్రమంలో 25 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో పెనమలూరు గ్రామం కిటకిటలాడింది.

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

విజయవాడరూరల్: నున్న గ్రామంలో వికాస్ కాలేజీలో ఆదివారం సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న సైనిక్ స్కూల్‌కు సంబంధించి 5వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 గంటల వరకు, 9వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించారు. ఈ రెండు ఎంట్రన్స్ పరీక్షలకు 1,328 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,234 మంది హాజరయ్యారు. పరీక్షలు పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

ముమ్మరంగా కులగణన

- జిల్లాలో 508 సచివాలయాలు
- లక్ష్యం 6,15,215 కుటుంబాలు
- ఇప్పటి వరకు 5,25,789 కుటుంబాల సర్వే పూర్తి
- 13,14,385 మంది జనాభా
- 85.46 శాతం సర్వే పూర్తి

చిలకలపూడి(మచిలీపట్నం): అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేయాలనే మంచి నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఇప్పటికే కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి కులసంఘాలు, మేధావుల అభిప్రాయాలు సేకరించారు. ఈ నెల 19 నుంచి జిల్లాలో కులగణన ప్రారంభమైంది. జిల్లాలోని 508 సచివాలయాల పరిధిలో 9,625 క్లస్టర్లలో 6,15,215 కుటుంబాల్లో 16,96,831 మంది వివరాలు సర్వే చేయాల్సి ఉంది. ఇంటింటి సర్వేలో సచివాలయ ఉద్యోగి, గ్రామ, వార్డు వలంటీర్ భాగస్వామి అవుతున్నారు. వీరికి సర్వే చేయాల్సిన విధానం, సాంకేతిక అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో సాంకేతిక నోడల్ అధికారిని నియమించారు. వీరు ఎప్పటికప్పుడు సాంకేతిక సమస్యలను అధిగమించడానికి క్షేత్రస్థాయి సిబ్బందికి సాయం చేస్తున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా డేటా ఎంట్రీని చేపట్టారు.



చారిత్రాత్మక నిర్ణయం

సుదీర్ఘకాలం తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కులగణనసర్వే చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో 1881లో తొలిసారిగా జనాభా లెక్కలతో పాటు కులగణన జరిగింది. 1921 వరకు పదేళ్లకు ఒకసారి కులగణన నిర్వహించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. కులగణన చేయాలని తరుచూ డిమాండ్ చేసినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి నాంది పలికింది. దీంతో రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల అమలులో ఉప కులాలకు న్యాయం జరుగుతుంది. 726 కులాలకు సంబంధించి కులగణన చేపడుతున్నారు.

86.06 శాతం పూర్తి

జిల్లాలో 10 రోజులుగా చేస్తున్న కులగణన సర్వే ఆదివారం నాటికి 66.06 శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 508 సచివాలయాల పరిధిలోని 9,625 క్లస్టర్లలో 6,15,215 కుటుంబాలు 16,96,831 మంది వివరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు 9,570 క్లస్టర్లలో 5,29,430 కుటుంబాల్లో 13,30,737 మంది వివరాలను సేకరించారు. ఈ సర్వేలో ప్రతి ఇంటిని సందర్శించి కులగణన పూర్తి చేశారు. సర్వే పూర్తయిన తర్వాత నమోదు చేసిన డేటాను సరిచూసుకునేందుకు ఐదు రోజుల పాటు ఆయా సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. డేటా ధ్రువీకరణ, నిర్ధారణ ప్రక్రియ ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగుతుంది. అనంతరం ఈ సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

పక్కాగా నిర్వహిస్తున్నాం

జిల్లాలో కులగణన సర్వే పక్కాగా నిర్వహిస్తున్నాం. ఏ విధమైన ఫిర్యాదులు లేకుండా పదిరోజులుగా ఈ ప్రక్రియ చేస్తున్నాం. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది చేస్తున్న సర్వేను పర్యవేక్షిస్తున్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేసి షెడ్యూలు ప్రకారం పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

– రాజాబాబు, కలెక్టర్, కృష్ణా జిల్లా

మండలం అర్బన్	సచివాలయాలు	సర్వే చేయాల్సిన కుటుంబాలు	పూర్తయిన కుటుంబాలు
వైఎస్సార్ తాడిగడప	19	48,143	31,948
మచిలీపట్నం అర్బన్	51	57,329	45,694
ఉయ్యూరు	11	13,428	11,082
పెడన అర్బన్	9	10,873	9,002
బంటుమిల్లి	16	15,903	13,336
గుడివాడ అర్బన్	34	38,829	32,646
పెనమలూరు	11	16,047	13,664
కంకిపాడు	18	24,050	20,581
పమిడిముక్కల	17	19,262	16,724
నాగాయలంక	16	17,067	14,839
కృత్తివెన్ను	17	16,756	14,689
పామర్రు	17	19,525	17,206
గన్నవరం	24	31,955	28,172
ఉయ్యూరు అర్బన్	10	13,243	11,676
పెడన	17	12,570	11,112
మొవ్వ	16	18,787	16,687
ఉంగుటూరు	16	19,857	17,748
బాపులపాడు	22	30,903	27,778
గూడూరు	17	17,573	15,799
మచిలీపట్నం	26	25,643	23,091
అవనిగడ్డ	10	14,188	12,787
పెదపారుపూడి	9	10,827	9,796
ఘంటసాల	13	15,051	13,746
గుడివాడ	12	14,262	13,038
గుడ్లవల్లేరు	17	17,935	16,404
తోట్లవల్లూరు	13	14,994	13,754
కోడూరు	11	15,801	14,632
మోపిదేవి	12	12,984	12,121
నందివాడ	12	12,431	11,622
చల్లపల్లి	15	18,999	18,056
మొత్తం	508	6,15,215	5,29,430

ఆదుకుంటున్న జగనన్న ఆసరా

- నాలుగేళ్లలో రూ.74.27 కోట్ల రుణమాఫీ
- 20 వేల మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి

పెనమలూరు: మండలంలో అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆసరాగా నిలిచారు. పెనమలూరులో అక్కచెల్లెమ్మలకు గత నాలుగేళ్లలో రూ 74.27 కోట్ల రుణాలు మాఫీ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. పెనమలూరు మండలంలో 2020వ సంవత్సరంలో 2083 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019 సంవత్సరానికి ముందుగా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి దగా చేసింది. రుణాలు మాఫీ చేయలేదు. దీంతో డ్వాక్రా అక్కచెల్లెమ్మలు చంద్రబాబు మాట నమ్మి అప్పులతో నట్టేట మునిగి అప్పులపాలయ్యారు. రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు అక్కచెల్లెమ్మల వద్ద వడ్డీతో సహా రుణాల సొమ్ము వసూలు చేశారు.

జగన్న వచ్చిన తరువాత విముక్తి..

జగనన్న ముఖ్యమంత్రిగా అయిన తరువాత డ్వాక్రా సంఘాలకు రుణాల విముక్తి లభించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకంతో నాలుగు దఫాల్లో రుణాలు మాఫీ చేశారు. ప్రభుత్వం ఇటీవలే ఇచ్చిన హామీ మేరకు నాల్గవ విడత రుణ మాఫీ చేసింది. జిల్లాలో పెనమలూరు మండంలో అత్యధికంగా 2,096 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీటిలో 20,837 మంది సభ్యులు ఉన్నారు. నాలుగు సంవత్సరాల్లో వీరికి జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.74.27 కోట్లు రుణాలు మాఫీ చేశారు. జగనన్న హామీ నెరవేర్చడంతో డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెనమలూరులో సమావేశమైన డ్వాక్రా మహిళలు

రుణాలు మాఫీ జరిగింది ఇలా...

సంవత్సరం	గ్రూపులు	సభ్యులు	రుణమాఫీ (కోట్లలో)
2020-2021	2083	20,837	రూ.18.46
2021-2022	2097	20,553	రూ.18.69
2022-2023	2096	20,554	రూ.18.56
2023-2024	2096	20,543	రూ.18.56

జగనన్న రుణం తీర్చుకోలేనిది.



రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేశారు. జగనన్న రుణం తీర్చుకోలేనిది. జగనన్న మహిళలకు అండగా నిలిచారు.

– దూళిపూడి వాణి, డ్వాక్రా సంఘ లీడర్, పోరంకి

సీఎం జగన్ ఆదుకున్నారు..



గత పాలనలో రుణాలు మాఫీ చేస్తానని చేయలేదు. అప్పుల్లో ఉన్న తమను జగన్ రుణమాఫీ చేసి ఆదుకున్నారు. ఆర్థిక తోడ్పాటు చేయటంతో రుణ విముక్తి లభించింది. జగనన్న సాయం మరువలేనిది.

బి.నాగేశ్వరమ్మ, డ్వాక్రా సభ్యురాలు, పోరంకి

అంబేడ్కర్ స్మృతివనానికి
సందర్శకుల తాకిడి

విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. స్మృతివనంలోని అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, ఫౌంటెన్లు, వివిధ ఆకృతులను ఆసక్తిగా తిలకించారు. ఆయా దృశ్యాలను సందర్శకులు వీక్షించి, కెమెరాల్లో బంధించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ఎంపీడీవో భార్గవి బదిలీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. రూరల్ ఎంపీడీఓ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ఉయ్యూరు: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2024–25 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్నం నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారన్నారు. 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ ఉదయం 10.30 గంటల నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు.

నేడు ఆడుదాం ఆంధ్రా ముగింపు పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా ముగింపు పోటీలు సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ప్రారంభమైన నియోజకవర్గస్థాయి క్రీడా సంబరాల్లో భాగంగా ఇప్పటికే పురుషులు, మహిళల విభాగంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు ముగిసినట్లు పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్ విభాగాల్లో సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐదు క్రీడా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ముగింపు వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

శరవేగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

ఉయ్యూరు: ఉయ్యూరు మార్కెట్‌యార్డు ఆవరణలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.81 లక్షలు అంచనా వ్యయంతో చేపడుతున్న తొమ్మిది షాపుల పనుల్లో పురోగతి కనిపిస్తోంది. పేద, మధ్యతరగతి వర్గాలకు దుకాణాలు మంజూరు చేసి రైతులకు తోడ్పాటు అందించే దిశగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. కార్యాలయం ముందు, కాటూరు–ఉయ్యూరు రోడ్డుకు తూర్పు దిక్కుగా జరుగుతున్న పనులను ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించి కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకొస్తామని చైర్మన్ తెలిపారు.



పనులను పర్యవేక్షిస్తున్న ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు

రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేని గూడెం గ్రామంలో కొత్తగా నిర్మించే రహదారుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరైనట్లు ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని డ్రెయిన్లు, రోడ్డు నిర్మాణానికి బత్తుల పావ ఇంటి వద్ద నుంచి ఎస్ఎస్‌పీ కెనాల్ వరకూ రూ.32 లక్షలు, సాయి విద్యానికేతన్ నుంచి బత్తుల మధుసూదన్‌రెడ్డి ఇంటి వరకూ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.34 లక్షలు, బండి వెంకటరెడ్డి ఇంటి వద్ద నుంచి మహిళా మండలి బిల్డింగ్ వరకూ రూ.18 లక్షలు, పాత గ్రామ పంచాయతీ ఆఫీసు వద్ద నుంచి బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి ఇంటి వరకూ సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.36 లక్షలు మొత్తం 1.20 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి సుబ్బారెడ్డి, పలువురు నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థికి 'మానవత' సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సాయం అందించటంలో ఎల్లప్పుడూ ముందు ఉంటామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక ఏలూరురోడ్డుకు చెందిన పేద విద్యార్థి ఏనుగు అశోక్‌కుమార్ విట్‌లో బీటెక్ చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక సమస్యలతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు అశోక్‌కుమార్ తండ్రి శ్రీనివాస్ మానవత సభ్యులను ఆశ్రయించాడు. దీంతో ఆదివారం మానవత కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏనుగు శ్రీనివాస్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మారుబోయిన చేతుల మీదగా పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, సీనియర్ సభ్యులు ఘంటా సత్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో రోడ్డెక్కిన విభేదాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులోని సీయోను సీఎస్ఐ చర్చిలో విభేదాలు మరోమారు రోడ్డెక్కాయి. సంఘ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర విమర్శలు, దాడులకు పాల్పడ్డారు. నూతన చర్చి నిర్మాణం నిమిత్తం సేకరించిన విరాళాలు, నిర్మాణ వ్యయాలకు సంబంధించిన లెక్కలు చెప్పాలని కొందరు సంఘ సభ్యులు పట్టుబట్టడంతో రెండు నెలల క్రితం ఈ వివాదం రాజుకుంది. సంఘ పెద్దగా చర్చి నిర్మాణ బాధ్యతలు పర్యవేక్షించిన టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావుపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. బాపులపాడు పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు నేతృత్వంలో సంఘ సభ్యులు గతంలో పలుమార్లు ఆందోళనకు దిగటంతో విజయవాడ డయాసిస్ బిషప్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని సర్దిచెప్పేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆదివారం మరోమారు రెండు వర్గాల మధ్య తీవ్ర వివాదం చేలరేగింది. చర్చి ఎదుట సంఘస్తులతో కలిసి దయాల విజయనాయుడు ఆందోళన నిర్వహించారు. సంఘంలో కొందరు సభ్యులు దురుద్దేశపూర్వకంగా ఎస్సీ, బీసీ–సీ పేరిట వర్గాలు సృష్టించి విభేధాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సంఘంలో అధిక సంఖ్యలో ఎస్సీలు ఉన్నారని, చర్చి నిర్మాణంలోనూ 90 శాతం విరాళాలు ఎస్సీలే ఇచ్చారని చెప్పారు. బీసీ–సీలుగా ప్రభుత్వ గుర్తింపు కలిగిన వారికే చర్చిలో ఆధిపత్యం కావాలంటే నిరభ్యంతరంగా మరో చర్చి నిర్మాణం చేసుకోవచ్చని, ఇదే విషయాన్ని బిషప్ దృష్టికి తీసుకువెళతామని ఆందోళన చేసిన ఎస్సీలు తేల్చి చెప్పారు. ప్రస్తుత చర్చి నిర్మాణానికి వారు ఇచ్చిన విరాళాలను తక్షణమే వెనక్కి చెల్లిస్తామన్నారు.



బాపులపాడు సియోను సీఎస్ఐ చర్చి వద్ద అందోళన నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

కట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం భర్త వేధించటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చోడవరపు లక్ష్మీప్రసన్న కొన్ని సంవత్సరాల క్రితం సాతిక్‌ను పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్న కానుకలు ఇచ్చారు. అయితే భర్త అదనపు కట్నం కోసం వేధించసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీన భర్త వేధింపులు తాళలేక బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను చికిత్సకై ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో భర్త, మామపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు వినాయక్‌నగర్‌లో భార్యభర్తలు పిల్లా హారిక, పిల్లా రాజేష్ నివశిస్తున్నారు. వీరి వివాహం జరిగి 13 సంవత్సరాలవుతోంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భార్యభర్తలకు తరచుగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం భర్త టిఫిన్ తీసుకురావటానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఇంట్లో లేదు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. వెతికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

తీరప్రాంతాలలో మరింత విస్తృతంగా ఆర్టీసీ సేవలు

కృత్తివెన్ను: తీరప్రాంతాలైన మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు ఆర్టీసీ సేవలను మరింత విస్తృతంగా అందిస్తున్నట్లు ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. దీనిపై ఆయన ఆదివారం మాట్లాడారు. విజయవాడ నుంచి కాకినాడ, కాకినాడ నుంచి విజయవాడకు కృత్తివెన్ను మీదుగా వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సుకు ప్రయాణికులు విన్నపం మేరకు ఇప్పుడు కృత్తివెన్నులో స్టాపు కేటాయించినట్లు వివరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లికి మచిలీపట్నం నుంచి బస్సు సర్వీసు ఉందని, రాకపోకలకు (అప్ అండ్ డౌన్)కు సంబంధించి ముందుగానే టికెట్‌ను 35071కు కాల్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను, పల్లెపాలెంలలో స్టాపులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

రామవరప్పాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో ఆదివారం జాతీయ రహదారితో పాటు ప్రధాన గ్రామంలో సైడు డ్రెయిన్లలో పూడికతీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, హైవేపై పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. అంతర్గత రహదారులపై చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగునిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు వివరించారు.